



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

## చలం జీవితం – సాహిత్యం

### -9-

*చలం....గుడిపాటి వెంకట చలం. ఇతరుల గురించి రాయడం కంటే, ఆయన గురించి రాయడం కష్టం. అర్ధం చేసుకోవడం అంత కంటే కష్టం. ఎందరో ప్రయత్నించి, విఫలులైనారు. ఆయన ఒక వ్యక్తి కాదు. ఒక ఉద్యమం. ఆయన బహు మితభాషి. పురుషులంటే తగని బిడియం. రచనలో అయితే, ఎటువంటి మనిషినైనా నిలదీసి అడిగే మనిషి. కొత్త మనిషితో మాట్లాడడానికి బిడియ పడతాడు. నియంత లాగా లోకాన్నంతా శాసించాలనేటట్లు కనబడతాడు గానీ, తన అర్ధాంగిని తన అభిప్రాయాలకు అనుగుణంగా ప్రవర్తించమని కోరడు. గొప్ప విప్లవవాదిగా, ప్రచారకుడిగా తోచే పురుషుడు తన మిత్రుల పైనా, తనతో సంభాషించాలని వచ్చేవారి పై స్వీయసిద్ధాంతాలను రుద్దాలని ప్రయత్నించడు. గ్రంథ రచనలో తప్పా, ఇతర సమయాల్లో తన అభిప్రాయాల గురించి ఏమీ చర్చించడు.*

*గొప్ప ప్రచారకుడిగా, ప్రభోధకుడిగా కనిపించే వ్యక్తి ఈ విధంగా వుండడం విచిత్రమే. ఎవరు ఆయనను అనుగమించగలరు. అధిగమించగలరు. ఆయన మనసు సంచారం చేసే పొలిమేరలో నైనా, ఈ నరలోకంలో ఎవ్వరూ కాలిడ లేరు. అసలు వాళ్ళ కన్నా అధికంగా, ఆయన పడే వ్యధ ఎవరెరుగుదురు? నిరంతర చింతా నిమగ్నుడై, నలిగిపోయిన ఆ సాధు హృదయం, ఎన్ని జన్మలకైనా గట్టి పడుతుందా? ఆయన నీతి వేరు..మన నీతి వేరు..అయినా*

*ఆయన త్రికరణ శుద్ధి మనలో ఎందరికుంది? మన దృష్టి వేరు...ఆయన దృష్టి వేరు... అందుచేత ఆయనను మన సాధారణ కొలత బద్దలతో కొలవాలనే కృషి వ్యర్థం. సంఘ నీతికీ, అర్ధం కాని దానికీ అతీతమైనదాన్ని అనుసరించి ప్రవర్తిస్తే..లోకం చూసి ఓర్వలేక నిరసిస్తుంది. "ఇతరులందరికంటే ఎక్కువగా మంచిగా ఉండడానికి ప్రయత్నించే వ్యక్తి, అవినీతి కరమైన గుమ్మం లోకి అడుగు పెట్టేడన్నమాటే" అని జీవితమంతా ధారపోసి చెప్పగలిగాడు ప్రఖ్యాత సంఘ సంస్కర్త "బ్రాడ్లే"*

*చలాన్ని అవినీతి పరుడు అనే ముందు ఒక్క సంగతి మనం ఆలోచించుకుందాం. సంఘానికి నీతిని గురించి భావాలు తప్ప, నీతి లేదు. మనం అవినీతిని, నీతి అనే కవచం ద్వారా దురాచారలనూ, సాంప్రదాయం అనే రక్షణ ద్వారా కాపాడుకుంటున్నాం. మనం ఆచార దాసులం.అర్ధ దాసులం, సంఘ దాసులం, శాస్త్ర దాసులం, అన్ని విధాలుగా దాసులం.స్వతంత్రంగా ఆలోచించడం మానేశాం.మనం మనుషులం కాదు. మరలమై పోయాం. చలం ఏం చెప్పినా స్వతంత్రంగా ఆలోచించుకోమనే. చలం మన పంథాలకు ప్రభల విరోధి. తరతరాల నుండి తరలి వచ్చే ఆచారాలకూ, అత్యాచారాలకూ, సాంప్రదాయాలకూ, మన సాంఘిక నీతికీ, స్వాతంత్రాన్ని అరికట్టే మన వైవాహిక పద్ధతికీ పూర్తి వ్యతిరేకి. ఇటువంటి విప్లవవాది, న భూతో న భవిష్యతి. పుట్టలేదు. పుట్టబోదు."* ఈ మాటలు రాసింది, చలంగారు జీవించి వుండగా ఆయనవద్ద కూర్చొని, ఆయన జీవిత విశేషాలు స్వీకరించి "చలం జీవితం-సాహిత్యం"అనే ఉద్గ్రంథాన్ని రాసిన "గొర్రెపాటి వెంకట సుబ్బయ్య"గారివి.

ఒక రచయితను అనేక మంది విమర్శిస్తున్నారంటే...ఆ రచయితకు వున్న విశిష్టతా, విలువా తెలుస్తుంది. రచన ఒక స్థాయిలో ఉన్నప్పుడే విమర్శలు వస్తాయి. చలంగారికి వున్న విమర్శకుల సంఖ్య కూడా, ఆయన ప్రత్యేకతకు నిదర్శనమే. శతాబ్దంగాతెలుగు పాఠకుల హృదయాలల మంచికో, చెడుకో సంచలనాలు సృష్టిస్తున్న సాహిత్యాన్ని సృజించిన చలంగారి గురించిన తరువాత భాగం....

చలంగారి పెద్దబ్బాయి రవికి సుమారు 8,9 సంవత్సరాల వయసు వుండగా, గుండెలో రక్త ప్రసారానికి అడ్డంగా ఏదో పెరిగిందని తెలిసింది. వైద్యం కోసం హైదరాబాదూ, మచిలీపట్నం, పూనా.. చాలా చోట్లకి తిరిగారు. "ఈ కుర్రవాడికి ఇక ఆ జబ్బునయం కాదు. గుండె ఎక్కువ రోజులు పనిచెయ్యదు మహా అయితే మరో 6 సంవత్సరాలు మాత్రమే బ్రతుకుతాడు"అన్నారు డాక్టర్లు. ఆ వేదన 1924 నుండి 1930 వరకూ కొనసాగింది. ఆ రోజుల్లో వైద్య సదుపాయాలు ఎక్కువగా లేవు కాబట్టి, ఎన్ని కష్టాలు పడి వుంటారో, ఆ రక్త ప్రసరణ లేక పిల్లవాడు యెంత బాధ పడి ఉంటాడో ఊహించుకోవచ్చు.

చలం గారికి వ్యక్తి గతంగా నమ్మకం లేకపోయినప్పటికీ, ఎవరు, ఏం చెప్పినా చెయ్యడానికి సిద్దపడ్డారు. రవి కొడుకుగా కంటే, స్నేహితుడిగానే చూసుకున్నారు చిన్నప్పటినుండీ. ఆయనకెవరో మిత్రుడు చెప్పాడు. "హుబ్లీలో

"ఆరోడ స్వామి" అని ఒకాయన వున్నారు. ఆయన దీవిస్తే జబ్బు తగ్గుతుంది."అని. ఇదంతా 1927,28 ప్రాంతాలలో జరిగింది. ఆ మిత్రుడికి చెప్పారు "నాకేమీ నమ్మకం లేదు ఇలాంటి వాటి మీద. నేను వెళ్ళను" అని. అయితే రవి అన్నాడు "నాన్నా!ఒకసారి వెళ్దాం. తగ్గుతుందేమో. నీ నమ్మకం పక్కన పెట్టి, నాకోసం రారాదా..,!?"అని జాలిగా అడిగేసరికి, కొడుకును తీసుకొనివెళ్లారు. ఆ స్వామిగారేదో దీవించాడు. సహజంగా నే ఆ జబ్బు తగ్గలేదు. వెనక్కి వచ్చాక భార్య రంగనాయకమ్మ, చలంగారిని తిట్టి పోసారట."నీకు నమ్మకం లేదు. అందుకని తగ్గలేదు. నమ్మకం వుండి వుంటే, తగ్గివుండేది."అని.

అలాగే ఇంకోసారి ఏం జరిగిందంటే...ఏలూరులో పని చేస్తూవుండగా "సాధు కొండయ్య" అని ఒకాయన వచ్చాడు. ఆయన చలం గారికి మిత్రుడయ్యాడు. ఆయన చేతుల్లో ఏదో మహత్యం వుంది. ఎటువంటి జబ్బైనా ఇట్టే తగ్గిపోతుంది." అని ఎవరో చెప్పారు. సరే, అనుకొని, ఒకరోజు రవిని తీసుకొని ఆ చర్చికి వెళ్లారు. అంతకు ముందు నాలుగైదు రోజులు జ్వరంతో బాధపడుతునే వున్నాడు. ఎలాగైతేనే ఎత్తుకుని తీసుకెళ్ళాడు. ఆ సాధు కొండయ్య గారు రవిని చేత్తో తాకారు. వెంటనే రవి లేచి నిలుచున్నాడు. ఓహో! ఇదేదో బాగుంది. అనుకొని ఇంటికి వచ్చేశారు. ఆ రోజు మధ్యాహ్నానికి మళ్ళీ మామూలే అయిపోయింది. జబ్బు ఏమాత్రం తగ్గలేదు. అయితే ఆ కొండయ్య గారన్నారట "మొదటి జబ్బు తగ్గిపోయింది. ఇప్పుడు మళ్ళా కొత్త జబ్బు వచ్చింది."అని. ఎవరు ఏమన్నా...ఆ కుర్రవాడు వూపిరిపీల్చలేక బాధపడుతూ వుంటే, చలం కూడా బాధపడుతుండేవారు.

ఆ కాలాన్ని 6 సంవత్సరాలు పూర్తిగా రవి కోసమే ఇచ్చివేశారు. ఆ సమయంలో ఆయన మనస్థితి ఎలా ఉండేదంటే...ఆయన మాటల్లోనే చూద్దాం. " రవికి అట్లాంటి జబ్బు చేయడం లోకంలో అంత వరకూ చాలా దూరంగా వున్న రోగాలూ, భయాలూ, కడుపు కోతలూ, శోకాలూ అన్నీ నా దగ్గరగా వచ్చి నన్ను చుట్టుకున్నాయి. ఇట్లాంటి బాధ నా ఒక్కడికే కాదు. యెంత మంది నిర్భాగ్యులకో, మృగాల్లో, పక్షుల్లో, పురుగుల్లో యెంత మంది నా మల్లే ఏడుస్తున్నారోనని తలచుకొన్న కొద్ది నాకు ఆగ్రహం ఎక్కువయిపోతోంది. కుదరని రవి జబ్బుతో, నేను రవినే కాదు, దీనికంతకూ కారకుడైన కరుణా సముద్రుడైన ఈశ్వరుడ్నికూడా వదలుకుంటున్నాను. భాస్కరా! అతని గుండెలో రక్త ప్రసరణకు అడ్డుపడుతున్న ఆ కాస్త మాంసం ముక్కనీ కాల్చివేయలేవా? ఇన్ని నెలలుగా మేము పడుతున్న బాధ నీ దాకా రాదా భాస్కరా? ప్రార్ధనలతో, కన్నీళ్ళతో యెంత పిలిచినా పలకడు. సర్వాంత, సర్వ హృదాయంతర్యామి. రవి హృదయం లో చేరి మంట పెడుతున్నాడు. ఈ చిన్న రవి నిన్నేం చేసాడు ఈశ్వరా? దిక్కులేని వాళ్ళం. సర్వ మానవ బహిష్కృతులం. నీకెక్కడ కనబడ్డాం. వున్నావా ఈలోకంలో నువ్వు? ఎక్కడ వున్నావని వెతికినందుకా ఈ శిక్ష? ఇంత క్రూరుడ్నీ, ఇంత కఠినుడ్నీ, నిన్నా ఇన్నేళ్ళూ ప్రార్ధించీ పూజలు చేశాను. చూడు ఈలోకం ఎట్లా మెరుస్తుందో, అన్ని ప్రాణులూ యెట్లా గంతులేస్తున్నాయో?ఆనందంతో గడ్డి యెట్లా ఉల్లాసంగా వూగుతోందో? నా పక్కన వున్న ఆ చెట్టుకొమ్మల్లో, ఆనందం పట్టలేక పక్షులు ఆ కొమ్మ

మీదనుండి, ఈ కొమ్మ మీదకు ఎగురుతున్నాయో?ఈ జబ్బు రాకపూర్వం మా చిన్న రవి కూడా గంతులు వేసేవాడు. ఈ మైదానమంతా పరిగెత్తేవాడు కదా! గుండు దెబ్బతిన్న పిట్ట మల్లె ఏం జరిగింది? నేనెందుకిట్లా అయినాను? అని ఆశ్చర్యపడే కళ్ళతో పడిపోయినాడు రవి. ఎందుకు పంపావు మమ్మల్ని ఈ లోకం లోకి. నువ్వు మాతో ఇష్టం వచ్చినట్లు ఆడుకోవడానికా? క్రూరుడా...రాక్షసీ... పిశాచీ..ఎవరు చెబుతారు?ఎవరిని అడగను?" ఇంతగా చలం ఆ ఆరు సంవత్సరాలూ బాధ పడుతూనే వున్నారు. కొడుక్కి ఉన్న జబ్బు ఎలాగైనా తగ్గాలని, అది తగ్గదు అని తెలిసి కూడా.

ఈ రోజుల్లో ఆయన రాజమండ్రీ, బందరూ, అనంతపురం, ఏలూరూ ఈ ఊర్లన్నీ బదిలీలు అవుతునే వున్నాయి. రవికి ఒక్కోసారి ఏమయ్యేదంటే...అతను ఏ మాత్రం శ్వాస తీసుకోలేనప్పుడు, ఇంజక్షన్ ఒకటి ఇవ్వాల్సి వచ్చేది. అందుకని ఆయన క్రమం తప్పకుండా వైద్య సదుపాయం వున్న చోటే వుండాల్సి వచ్చింది. ఇలా వుండగా చలం గారి వదినగారు హైదరాబాద్ లో వున్నారు కదా! అప్పట్లో వున్న నిబంధనల ప్రకారం, నిజాం ప్రాంతపు ఆసుపత్రులలో పని చేస్తేనే, ఆ తరువాత సొంతంగా ప్రాక్టీసు పెట్టుకోవడానికి అనుమతి ఇస్తారు. ఆ నిబంధన ప్రకారం ఆమె 1930 సంవత్సరం వచ్చేసరికి కరీంనగర్ ఆసుపత్రిలో పని చెయ్యడానికి వెళ్లారు. చలంగారికి తరచూ బదిలీలు అవుతున్నాయి. రవి డాక్టరు గారి పర్యవేక్షణలో వుండాలని ఆలోచించి, భార్యనీ, పిల్లల్నీ డా: రంగనాయకమ్మగారుగారి దగ్గరకు కరీంనగర్ పంపించడానికి నిర్ణయించుకున్నారు. ఆ తరువాత తను కూడా కరీంనగర్ ట్రాన్స్ ఫర్ చేయించుకొని వెళదామని అనుకున్నారు.

ఇంకో విశేషం ఏమిటంటే...ఇవన్నీ జరుగుతున్నరోజుల్లోనే 1925 ప్రాంతాల్లో చలం, రంగనాయకమ్మగార్లకు ఒక పాప పుట్టింది. రవికి అనారోగ్యం గా వుండడం వలన, ఈ రెండవ పాపకి చాలా కాలం వరకూ పేరు పెట్టలేదు. ఈమె చలంగారికి 4వ సంతానం. రెండవ ఆడపిల్ల. ఆ తరువాత ఆమెకు నిర్మల అని పేరు పెట్టారు. చలం గారి ఇంట్లో అందరూ ఆమెని "చే"అని పిలిచేవారు. కొంచెం సేపు ఈ కధను ఇక్కడ కొద్ది క్షణలు ఆపి – 2019 మార్చ్ కి వద్దాం. ఒక విషయం చెబుతాను.

"నేను ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన 2019 జనవరి నెలలో చలం గారి కుటుంబ సభ్యుల గురించి వాకబు చేస్తున్నప్పుడు తెలిసింది, వాళ్ళ సంతానంలో జీవించి వున్న ఒకే ఒక వ్యక్తి ఇదిగో ఇప్పుడే పుట్టిన...మీకు పరిచయం చేసిన నిర్మల గారు. ఆమె వయసు ఇప్పుడు 95 సంవత్సరాలు. కోయంబత్తూరు లోని చిన్మయా మిషన్ ఆశ్రమంలో వున్నారని తెలుసుకొని, ఫోన్ ద్వారా ఆవిడతో మాట్లాటడానికి ప్రయత్నించాను. ఆ ఆశ్రమం ఇన్ చార్జ్ తో మాట్లాడను. అయితే, వాళ్ళు ఏం చెప్పారంటే... "కొంచెం డిమోన్షియా వుందండి. గుర్తు పట్టలేకపోతున్నారు. కొత్త వాళ్ళంటున్నారు. ఏమీ మాట్లాడే స్థితిలో లేరు."అని. అందువల్ల ఆవిడతో మాట్లాడలేకపోయాను. విశేషాలు ఎలా సేకరిద్దామా అని ఆలోచిస్తుండగా...ఇదిగో క్రిందటి వారమే దుర్వార్త. ఆ నిర్మల గారు ఈ నెల 3 వ తేదిన ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె

మరణంతో చలం గారి సంతానం, అంటే చలం గారికీ, రంగనాయకమ్మ గారికీ పుట్టిన సంతానం అందరూ కూడా ఈ లోకం విడిచి వెళ్ళిపోయారు. ఈ వారం నిర్మల గారి పుట్టుక గురించిన ప్రస్తావన రావడం, ఇదే సమయంలో ఆమె మరణించారని తెలియడం చాలా యాదృచ్చికం. మళ్ళీ మనం 1930 లోకి వెళదాం.

అలా కుటుంబ సభ్యులందరూ కూడా కరీంనగర్ వెళదామని నిర్ణయించుకున్నారు. అప్పుడు చలం గారు గుంటూరులో పనిచేస్తున్నారు. ముందుగా నలుగురు పిల్లల్నీ వెంటబెట్టుకొనిభార్య రంగనాయకమ్మగారు అక్క గారి దగ్గరకు వెళ్లారు. రవికి ఒకరోజు బాగుంటే, మరో రోజు బాగుండేది కాదు. ఒక్కోసారి ఉన్నట్టుండి ఒళ్ళు చల్లబడి పోయేది. ఇంట్లో డాక్టరు గారు వున్నారు కాబట్టీ, సత్వరమే వైద్యం చేసేవారు. తమ్ముడికీ, ఇద్దరు చెల్లెళ్ళకీ కూడా ఏదో జరుగుతుందని తెలుసు గానీ, ఏం జరుగుతుందో తెలీని వయసు. ఎగురుతూ, తుళ్ళుతూ వుండే రోజుల్లో అన్నయ్య, ఎప్పుడూ గబ గబా నడిచేవాడు. అలాంటిది ఎప్పుడూ ఆయాసంతో వుండడం వాళ్ళు గమనించేవారు. ఒక్కోసారి వాళ్ళ వైపు బెంగగా చూసేవాడు రవి. వాళ్ళ అమ్మకు కూడా "అమ్మా! నా కోసం ఎందుకు నా కోసం బాధ పడతావు.ఈ జబ్బుదేహం కోసం ఎందుకేడుస్తావు?నను మళ్ళీ ఆరోగ్యంగా నీ కడుపులో పుడతానులే"అని ఓదారుస్తూ ఉండేవాడట. ఈ రవి చాలా తెలివిగలవాడని అనుకున్నాం కదా! అప్పటికి రవికి 14 సంవత్సరాల వయసు. అతనికి కూడా ఇక తన జబ్బు తగ్గదు అని తెలుసుకున్నపుడు, వైరాగ్యాన్నీ, ఆ డిటాచ్ మెంట్ నీ హ్యూమర్ గా మార్చుకున్నాడు. తన జబ్బుని జోక్ గా తీసుకుండేవాడట. ఒకసారి తల్లి నలుగురు పిల్లల్నీ కూర్చోబెట్టుకొని, ఏదో ఆట ఆడుతూ నీకో వెండి గిన్నె, నీకో గ్లాసూ, నీకో కొమ్ము చెంబూ కొనిస్తానే అలా చెబుతూ...చెబుతూ...పొరపాటున ఆవిడ రవిని మర్చిపోయారట. అప్పుడు రవి అన్నాడట "అమ్మా!అప్పుడే నన్ను మెంబర్స్ నుండి తీసేశావా?"అని. ఆమె వెంటనే బావురుమని ఏడ్చారట.

అంతే కాకుండా, చెల్లెళ్ళనీ, తమ్ముడినీ 'తను చనిపోతే, వాళ్ళు బాధపడ కూడదు' అని అప్పటి నుండే సిద్ధం చెయ్యడం ప్రారంభించాడు. ఎలా అంటే, "ఇప్పుడు మనం ఒక ఆట ఆడుకుందాం. నేను చనిపోతాను. మీరు ఏడవకూడదు." అని కళ్ళు మూసుకొని పడిపోయేవాడు. ఆ పిల్లలిద్దరూ ఒక్కసారి ఏడవడం మొదలు పెట్టేసరికి, తను లేచి, "ఇదిగో ఏడవద్దని చెప్పానా?"అని అంటూ...వాళ్ళని మానసికంగా సిద్ధం చేయిస్తూ ఉండేవాడట.ఆ ముగ్గురు పిల్లల్నీ అక్కడ స్కూల్లో చేర్పించారు డాక్టర్ రంగనాయకమ్మ గారు.

డాక్టర్ రంగనాయకమ్మ గారితో పని చేసే ఒక డాక్టర్ గారు రవికి మంచి స్నేహితుడయ్యాడు. ఇంటికి వస్తూ ఉండేవాడు. ఆరోగ్యం బాగున్నప్పుడు, కాస్త శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా లేనపుడు, రవి హార్మోనియం తో పాటు, పాటలు కూడా పాడుతుండేవాడు. ఒక్కోసారి సొరీస్ కు ఒక కానీ ఇచ్చి, "నువ్వు వెల్లోస్ నొక్కు"అనేవాడు. ఆ డాక్టరు గారు వచ్చినపుడు రవి చేత పాటలు పాడించుకునేవారు. ఇదంతా కరీంనగర్ లో వుండగానే.

ఒకరోజు ఉదయం 10, 11 గంటలయ్యింది. సౌరీస్ ట్యూషన్కి వెళ్లి వెనక్కి వచ్చింది. చిన్నపిల్లయిన నిర్మలను తీసుకొని డాక్టరుగారు బయటకు వెళ్లారు. సౌరీస్ రాగానే రవి "నువ్వు ఒకసారి వెళ్లి ఒయ్యి ని తీసుకు వస్తావా?"అన్నాడు. ఆ సమయంలో ఒయ్యి అప్పుడు ఒక మైలు దూరంలో వున్నారు. బయట ఎండగా వుంది. అందుకనే ఏమో గానీ "నేనిప్పుడు వెళ్ళలేను. ట్యూషన్ కి వెళ్ళిపోతున్నాను" అని అన్నయ్య మాట కూడా వినకుండా వెళ్ళిపోయింది. [ఒయ్యి అంటే, డాక్టర్ రంగనాయకమ్మ గారు. అసలు ఈ ఒయ్యి అని పిలవడానికి కారణం ఏమిటంటే, ఆమె చలం గారి ఇంటికి వచ్చినపుడు "వదిన" అని పిలవడం రాక "ఒయ్యి"అని పిలిచేవారట. అందుకని చలం గారి ఆత్మ కథలో అన్ని చోట్లా "ఒయ్యి" అనే వుంటుంది.]

సౌరీస్ ట్యూషన్ నుండి వచ్చేసరికి, ఇల్లంతా గందరగోళంగా వుంది. రవి చుట్టూ డాక్టర్లు వున్నారు. ఒయ్యి ఇంజక్షన్ ఇచ్చే పనిలో వున్నారు. పిల్లలంతా వేరే గదిలో వున్నారు. అంత విషమ పరిస్థితిలో కూడా రవి యెంత హాస్య పూర్వకంగా ఉండేవాడంటే... [తను గుండెను వీడు..వీడు...అంటుండేవాడు] "వీడు ఎప్పుడు ఆగిపోతాడో తెలీదు ఒయ్యీ! వీడు ఆగిపోయినపుడు నువ్వు ఇంజక్షన్ చేస్తావా?" అన్నాడు. ఒయ్యి ఇంజక్షన్ ఇస్తే, అది పని చెయ్యలేదు. "ఒయ్యీ!నువ్వు వాటర్ ఇంజక్షన్ ఇచ్చావా? ఇదిగో వీడు కొట్టుకోవడం మానేస్తానని అంటున్నాడు. నువ్వు నాన్నకి టెలిగ్రాం ఇచ్చావు కదా! నాన్న వస్తారు కదా!" అని మాట్లాడుతూనే కళ్ళు మూసేశాడు 14ఏళ్ళ రవి. వాళ్ళందరూ యెంత ప్రయత్నించినా, ఆ గుండెను మళ్ళీ కొట్టుకునే లాగ చెయ్యలేకపోయారు. ఆ 14 ఏళ్ళ కుర్రవాడు ఎవ్వరికీ బాధలేకుండా చేద్దామని, హాయిగా, నవ్వుతూ, అల్లరి చేస్తూ గడిపి వెళ్ళిపోయాడు. ఆటను జీవించి వున్న రోజుల్లోకూడా అమ్మా, నాన్నా ఎక్కడ బాధపడతరోనని అనుకుంటుండేవాడట. చలం గారికి టెలిగ్రాం ఇచ్చారు.

ఆయన కోసమని రవి శరీరాన్ని మూడు రోజుల పాటు అలాగే ఉంచారు. ఇది చలం గారి కుటుంబంలో మొట్ట మొదటి దురదృష్టం. ఆ రోజుల్లో మృత దేహాన్ని వుంచడం అంటే, ఇప్పటి సౌకర్యాలు ఏమీ లేవు కదా! ఆ కుర్రవాడికి అత్తర్లన్నా, నారింజ కాయలన్నా ఇష్టం. ఎవరు వచ్చినా అతని కోసమని అత్తర్లు తెచ్చేవారు. ఆ అత్తర్లూ, స్పిరిటూ పూసి శరీరం పాడవకుండా నిద్రపోతున్నట్లుగా అలాగే ఉంచారు. అయితే, మూడు రోజులైనా చలం గారు రాలేదు. 'ఇంక ఆయన రారు' అని నిర్ధారించు కున్నాక, రవికి అంత్యక్రియలు జరిపించారు. తీసుకువెళ్ళేటప్పుడు అతని శరీరం మీద వాళ్ళ అమ్మ కట్టుకునే గులాబి రంగు చీర కప్పారు. ఎందుకంటే, ఆ చీర కట్టుకొని, ఆమె పిల్లల ముందు సరదాగా నాట్యం చేసి అలరించేవారు.

ఆ కరీంనగర్ వూర్లో నుండి కొంతమంది ముస్లిం యువకులు తెల్ల రుమాళ్ళు కట్టుకొని వచ్చారు. "అతను వెళ్ళిపోయాడు. ధాత్రీ మాత పునీత పరిష్వంగం లోకి వెళ్ళిపోయాడు. అతని స్మృతులు విహంగాలై వాలుతున్నాయి. వాడిపోని పువ్వులై విచ్చు కుంటున్నాయి. అత్తర్లల్లో, సెల్లాలలో, పువ్వులలో అతన్ని రాజకుమారుడిలాగా

తీసుకువెళుతున్నారు. అనంతాకాశం, పునీత ధాత్రీ, అన్నీ అతను తమ చెంతకు వస్తాడని యెంత గానో ఆనందంగా స్వాగతం చెబుతున్నాయి" ఈ వాక్యాలు సౌరీస్ తన ఆత్మకథలో రాసుకున్నారు.

అందరూ వెళ్లారు. ఆ రవిని పుడమి తల్లిలో కప్పేసి వచ్చారు. సౌరీస్ గోల పెట్టిందట " అయ్యో! అన్నయ్యని అలా కప్పేశారు. మళ్ళీ ఎలా వస్తాడు?"అని. ఇంక ఆ వూర్లో ఉండలేక, అక్కడ నుండి వచ్చేద్దామని అనుకున్నారు. అతనికో సమాధి కట్టించి, సమాధి దగ్గర సాయంకాలం అవ్వగానే దీపం వెలిగించడానికీ, పాలు పొయ్యడానికీ ఎవరికో అప్పజెప్పారు. ఆ రవికి వున్న వస్తువులు గ్రామఫోన్, కెమెరా లాంటివి. వాటితో ఏవేవో ప్రయోగాలు చేస్తుండేవాడు. అవీ, అతని దుస్తులూ, ఏవీ మిగల్చకుండా, ఆ వూర్లో వున్న వాళ్లకు ఇచ్చేసి, బరువైన మనసులతోటి, మిగతా ముగ్గురు పిల్లల్నీ తీసుకొని పెద్దవాళ్లిద్దరూ వెనక్కి వచ్చేశారు. వెనక్కి ప్రయాణం చేస్తున్నంత సేపూ పెద్దవాళ్ళు ఏడుస్తూనే వున్నారు. పిల్లలు ఏడుపుని ఆపుకుంటున్నారు. ఎందుకంటే, నేను చనిపోతే ఏడవద్దు. అన్న విషయం వాళ్ళు గుర్తు పెట్టుకున్నారు. బెజవాడ ప్లాట్ ఫారం మీద దిగారు. చలం గారు వాళ్ళ కోసమని వేచి చూస్తున్నారు. దిగగానే నవ్వుతూ వాళ్ళని దగ్గరకు తీసుకున్నారు.

పిల్లలు అన్నారట "నాన్నా! నువ్వే మంచి వాడివి. నవ్వుతున్నావు. అమ్మా, ఒయ్యా చూడు! ట్రైనంతా ఏడుస్తూనే వున్నారు."అని. అంత మాత్రం చేత చలం గారికి బాధ లేదని కాదు. ఆయన బాధని మనసులోనే దాచుకొని, పిల్లల దగ్గర వ్యక్త పరచకుండా వున్నారు. నిజానికి ఆ కొడుకు గురించి ఆయన తన ఆత్మ కథలో రాసుకున్నారు. ఆ వాక్యాలనే యధాతధంగా చూద్దాం. ఎందుకంటే, కొన్ని కొన్ని భావోద్వేగాలు మనం అర్ధం చేసుకోవడానికి చలం గారి వాక్యాలనే ఆశ్రయించాలి.

"రవి చచ్చిపోయినాడు. చచ్చి పోయినప్పుడు నేను దగ్గర లేను. అతను పడుతున్న బాధ చూస్తుంటే, ఎవరికైనా "ఇతను ఎందుకు బ్రతికి వుండడం. చచ్చిపోవడమే హాయి" అనిపిస్తుంది. అతను చచ్చిపోయి, ఎక్కడకి వెళ్ళాడు? నేను, అతన్ని వదిలి ఇక్కడ ఏం చేస్తుంటాను? మళ్ళీ ఈ సంతోషం ఉంటుందా? ఈ ఒంటరితనంలో పడిపోయాను. అతని పర్సనాలిటీ అలాంటిది. అందరినీ, ఇంకా కాలాన్ని కూడా ఏ విధంగా ఆక్రమించుకున్నాడు. అసలు రవి లేనే లేడు మాతో. అదొక కల. ఎందుకు దాన్ని తలచుకోవడం. స్నేహితులందర్నీ పిలిచి, అటూ, ఇటూ తిరిగి జ్ఞాపకాలన్నీ ఎల్లానో వదిలించు కోవాలనీ చూశాను. కానీ, రవి చచ్చిపోవడంతో నా లోపల ఏదో తెగిపోయింది. అసలు ఎక్కడనుండి సంతోషం వస్తుందో..ఆ నరం తెగిపోయింది. పై పై సంతోషాలన్నీ వస్తున్నా యన్నమాటే గానీ, లోపల నుంచీ నేను మామూలు మనిషిని కాను. పైన ఏ దిగులూ లేదు. అంతా నెట్టేసుకున్నాను. తీసేసుకున్నాను. కానీ, దుఃఖం అనేది పై పై అనుకున్నా గానీ, దాని వేళ్ళు ఎక్కడో ఉంటాయని, నా కపుడు తెలీదు అస్సలు. అందువల్ల నేను ఏది గొప్పగా చేసుకొని అనుభవించాలని చూసినా, వస్తుంది పై నుంచి. కానీ, లోపల నుంచి సంతోషం రావడం మానేసింది. అంతే, నా

జీవితానికంతే. తరువాత నేను గొప్పగా సంతోష పడలేను. ఎందుకంటే, నా బ్రతుకులో ప్రతీదీ చెట్టు అందం, ఆకాశం అందం, పిట్టల అందం, అరుపులూ ఇవన్నీ కూడా రవితో కలసి నశించాయి. రవీ, నేనూ ఇద్దరం ఒక్కటై ఈ సంఘాన్ని తిట్టుకోవడం, వాళ్ళని దుయ్య బట్టడం, వెక్కిరించడం, నవ్వుకోవడం ఇవన్నీ కూడా మేం ఇద్దరమూ లోపలనుండి ఒక్కటై అనుభవించాము. ఎప్పుడూ ఇట్లానే వుంటాం అనుకునే వాళ్ళం. కానీ, రవి భూమిలో కలసిపోయాడు. ఏ లక్ష్యం లేకుండా, ఏదుంటేనేం, మేం ఇద్దరం ఒక్కటై పోయాం. అన్నట్లుగా కలసిపోయాం. మాతోనే ఒయ్యి కూడా అంతగా కలసివుండేది. తను ఉద్యోగంలోకి వెళ్ళిపోయింది. రవి చచ్చిపోయినాడు. నేను ఏకాకి నయ్యాను. మళ్ళీ "షా" కొంచెం పెద్దదయి,నా భావాల్ని అర్థం చేసుకునే స్థాయి వచ్చేవరకూ కూడా నాలోని ఈ బాధ లోపల.. లోపల నేను కుమిలి పోతూ, రగిలి పోతూ ఉండేవాడిని"అని చలం గారు చెప్పుకున్నారు. ఇదండీ చలం గారి పెద్దబ్బాయి రవి నిష్క్రమణ పర్వం.

మరి ఈ సంవత్సరాలలో చలం గారి సాహితీ జీవనం ఎలా కొనసాగింది? చలం గారికున్న అనేకానేక ప్రత్యేకతల్లో ఒకటేమిటంటే...జీవితమంతా కూడా ఘర్షణ. అంత ఘర్షణ లోకూడా, ఆయన విస్తృతంగా, పుంఖాను పుంఖాలుగా కథలూ, వ్యాసాలూ, నాటకాలూ వ్రాయడం.1920 –30 మధ్యలో చలం గారు రాసిన, అనేక పుస్తకాలు ఇప్పటికి కూడా అభిమానులు ఎక్కువగా చదివేవి, విమర్శకులు ఎక్కువగా విమర్శించేవి అయిన పుస్తకాలు ఈ ఘర్షణ కాలంలోనే రాశారు. వాటిల్లో కొన్నిటిని గుర్తు చేసుకోవాలంటే, "శశిరేఖా, దైవమిచ్చిన భార్యా, మైదానం...లాంటి నవలలు. అలాగే చిత్రంగీ, హరిశ్చంద్రా లాంటి నాటకాలూ, స్త్రీ, బిడ్డల శిక్షణా వంటి అద్భుతమైన వ్యాస సంపుటాలూ ఇంకా వీటన్నిటికంటే భిన్నమైనది, ఆ కోవలో ప్రప్రథమ ప్రక్రియ. దాన్ని ఏ వర్గంలో వేస్తారో, ఆ వర్గంలో అదే మొదటిది"ప్రేమ లేఖలు" ఇవన్నీ కూడా ఆ సంక్షోభ సమయంలోనే రాశారు. తరువాత వీటన్నిటి గురించి ప్రస్తావించు కుందాం. మళ్ళీ చలం గారి జీవిత విశేషాలలోకి వద్దాం.

అందరూ కరీంనగర్ నుండి వచ్చేశారు. డాక్టర్ రంగనాయకమ్మ గారు నిభందనల ప్రకారం నైజం ప్రాంతంలో కొన్నాళ్ళు సర్వీస్ చేసేశారు కాబట్టీ, ఇప్పుడు ఎక్కడైనా ప్రాక్టీసు పెట్టుకోవచ్చు. ఎక్కడ పెడదామా అని ఆలోచించారు. మొదట తెనాలిలో పెడదామని అనుకున్నారు. కానీ "బెజవాడలో అయితే, అందరికీ మధ్యలో వుంటుంది. చలం గారికి తరచూ బదిలీలు అవుతుంటాయి కాబట్టీ, ఎటు వెళ్ళినా పెద్దగా ఇబ్బంది ఏమీ వుండదు. పిల్లలకి అక్కడైతే చదువుకోవడానికి బాగుంటుంది" ఇలా ఆలోచించి, బెజవాడలోనే ప్రాక్టీసు పెట్టడానికి నిర్ణయించుకున్నారు. పైగా డాక్టర్ రంగనాయకమ్మగారు పుట్టిన వూరు కూడా బెజవాడే. అలా ఆమె బెజవాడలో ప్రాక్టీస్ ప్రారంభించారు. అక్కడ మొదటి మహిళా డాక్టర్ లేదా మొదటి హిందూ మహిళా డాక్టర్ కూడా డాక్టర్ రంగనాయకమ్మ గారే.

చలం గారి కుటుంబం అంతా డాక్టర్ గారి దగ్గరకే చేరారు. ఇక చలం గారు బెజవాడ వచ్చేస్తే బాగుంటుదని ఆయన కూడా అక్కడకే ట్రాన్స్ ఫర్ చేయించుకున్నారు. ఈ “చేయించు కోవడం “అనేది అంత సులువుగా ఏమీ జరగలేదు.

చలంగారు గుంటూరు నుండి బెజవాడ రావడానికి మధ్యలో ఏం జరిగిందంటే... రవి చనిపోయిన కొద్ది రోజుల ముందు...వాళ్ళ స్కూల్లోనే గోపాలాచారి అని ఒకతను పనిచేస్తున్నాడు. వాళ్ళ అబ్బాయి చనిపోయాడు. అదే రోజుల్లో వాళ్ళ హెడ్ మాస్టారు అమ్మాయి చనిపోయింది. ఇవన్నీ గమనిస్తున్న వాళ్ళు ఎవరో చెప్పారట ”ఈ బడికి ‘పుత్ర దోష జాతకం’ వుంది. లేదా సంతాన దోష జాతకం వుంది. ఇందులో పని చేసేవాళ్ళ పిల్లలు చనిపోతారు” అని.

చలంగారికి జాతకాల మీద నమ్మకాలు లేవు. కాకపోతే, అప్పుడు రవి చనిపోయిన భయంకరమైన విషాదం లో వున్నారు. పైగా వాళ్ళు అలా చెప్పారు. ఆయనకి ఈ జాతకాల సంగతేమిటో చూద్దాం. పిల్లలందరూ చనిపోతారేమో, మళ్ళీ పిల్లలకు ఏమవుతుందో, వాళ్ళ జీవితం మీద నాకేం అధికారం వుంది. ఇలా ఆలోచించి, జాతకం చెప్పించుకోవడానికి వెళ్లారు. ఈయన స్నేహితుడు చింతా దీక్షితులు వున్నారు కదా! ఆయన, చలంగారిని జాతకాలు చెప్పే ఒక అరవ వ్యక్తి దగ్గరకు తీసుకువెళ్ళారు.

ఆయన వద్ద ‘సుఖ నాడి’ అనేది వుందట. యేవో పాత తాటాకులు వుంటే దాని మీద మీ అందరి జాతకాలూ ఉంటాయనీ, వెళ్ళిన వాళ్లకు ఏదో ఒక తాటాకు తీసి, దాన్ని చదివి వినిపిస్తూ ఉండేవాడు. అందుకని అక్కడకు వెళ్లారు. ఆయన ఒక తాటాకు తీసి, “ఇదిగో నీ జాతకం.ఇక్కడ వుంది. ఎప్పుడో ఎవరో రాసి పెట్టారు” అనిచెప్పాడతను. ఆ జాతకం ఏదో చదివి వినిపించాడు. దాంట్లో “వుద్యోగం చేస్తాడు.” అని వుంది గానీ ఈయన తిరిగేటటు వంటి స్వేచ్ఛా ప్రణయం గురించి గానీ, పుస్తకాలు రాస్తారని గానీ ఇలాంటివి ఏవీ లేవు. నువ్వు బాగా డబ్బు సంపాదిస్తావు. బంగారు నగలు చేయించు కుంటావు. డబ్బుని వడ్డీకి ఇచ్చి బాగా డబ్బు సంపాదిస్తావు. ఇలాంటి వన్నీ రాసివున్నాయి. ఇదంతా చదివేసరికి ఆయనకు అనుమానం వచ్చింది. నువ్వు సగం వరకే చదివావు. అనుకున్నారు.”ఇందులో ఉన్నదే చదివానండీ”అన్నాడతను. అందులో వాటిల్లో చాలా వాటిలో వ్యతిరేకం చలం గారికి. బంగారం అంటే పరమ అసహ్యం. ఎవరైనా బంగారు నగలు పెట్టుకుంటే వాళ్ళ మీద అభిప్రాయం పోయేది. పైగా డబ్బులు – ఆయనకు వచ్చే డబ్బులే తక్కువ. డబ్బులను వడ్డీకి ఇవ్వడం అంటే ఏమిటో తెలీదు. ఎవరి దగ్గరైనా వడ్డీ కి తీసుకునేవారు కాదు. ఎవరికైనా డబ్బులు ఇస్తే, తిరిగి అడిగేవారు కాదు.అందువల్ల – ఆయన చెప్పింది విని నమ్మకం కలగలేదు.

దీక్షితులు గారు , “శాంతులు చేయించు. శాంతులూ, గ్రహాలూ అనేవి వుంటాయి. పిల్లలకు ఆరోగ్యం బాగుంటుంది.”అన్నారు. ఆ వెంటనేనో, కొద్ది సంవత్సరాలకో “రామేశ్వరం దగ్గర సేతువులో స్నానం చెయ్యాలి.” అని తీసుకువెళ్ళారు. ఆ శాంతుల కోసమని తీసేసిన జంధ్యం మళ్ళీ వేసుకున్నారు. పూజలు చేశారు. హోమాలు చేశారు.

స్నానాలు చేశారు. ఆ శాంతులు అయిపోగానే మళ్ళీ జంధ్యం తీసేశారు. ఇంతా చేస్తే, పిల్లలెవరూ చచ్చిపోలేదు. పైగా ఎంతోమంది పిల్లలు పోగైనారు. కానీ, ఈ జాతకం విషయం ఏమిటో తెలుసుకోవాలని అనిపించింది. అందుకని గుంటూరులో వుద్యోగం చేసేటప్పుడు ఆ జాతకాలు చెప్పే ఆయన దగ్గరకు రోజూ వెళ్ళేవారు. రకరకాల వాళ్ళు అక్కడకు జాతకాలు చెప్పించు కోవడానికి వచ్చేవాళ్ళు. ఇతను చెప్పింది నిజం అవుతుందో లేదో గానీ, వాళ్ళకు నచ్చి, సంతృప్తిగానే వెళ్ళేవాళ్ళు. మొత్తానికి ఎలా అయితేనేం చలంగారికి జాతకాల మీద ఒక విధమైన నమ్మకం వచ్చింది. అది చాలా కాలం కొనసాగింది.

అలానే, చలంగరికి కూడా ఒన సుదీర్ఘ అనారోగ్య సమస్య ఉండేది. ఆయనకు పుట్టినప్పటి నుండి మైగ్రేన్ వుండేది. తీవ్రమైన తలనొప్పి. నిద్ర పట్టేది కాదు. ఉన్నట్టుండి తలపగిలి పోతున్నట్లుగా వుండేది. ఏమీ చెయ్య బుద్ధయ్యేది కాదు. ఆ తలనొప్పి తగ్గించడానికి దీక్షితులు గారు ..''నేను కొన్ని ఉపాయాలు చెబుతాను. అవి చెయ్యండి. తగ్గిపోతుంది''అన్నారు. ఇవన్నీ కూడా రవి చనిపోయిన తరవాతే. గుంటూరులో ఉన్నప్పుడే. “నువ్వు కార్తీక సోమవారాలు వుండు. అలా వుంటే, నీ తలనొప్పి తగ్గిపోతుంది''అన్నారు. దానికి చలం గారు ..''సరే! దీక్షితులు గారూ! మీరు చెప్పినట్లుగా కార్తీక సోమవారాలు నెల రోజులపాటు చేస్తాను. ఒక వేళ తగ్గక పొతే, నేను చెప్పినట్లుగా మీరు వినాలి.''అన్నారు. మధ్య వర్తిగా సుబ్బారావు గారని ఒకాయన్ని పెట్టుకున్నారు. సరేనని నెలరోజులూ కూడా చాలా శ్రద్ధగా, సనాతనంగా, పొద్దున్నేలేచి, స్నానం చేసి, ఉపవాసం వుండి ఇలా ఏవేవి చెయ్యాలో అన్నీ చేశారు.

నెలయ్యింది. తలనొప్పి ఏమాత్రమూ తగ్గలేదు. దాంతోటి దీక్షితులు గారి దగ్గరకు వెళ్ళి,” ఏమండీ! తలనొప్పి తగ్గలేదు. కాబట్టీ నేను చెప్పినట్టు చెయ్యండి.” అన్నారు. “ఏం చెయ్యాలి?” అన్నారు. “రండి. తురక హోటలుకి పోదాం. అక్కడ పలావు తిందాం''అన్నారు. అందరూ నవ్వేశారు. చలం గారు అనంతపురంలో ఉండగానే అంటే, గుంటూరు రాక ముందు నుండే మాంసం తినడం అలవాటు చేసుకున్నారు.ఇంట్లో వాళ్లకి కూడా అలవాటయ్యింది. ఒక్క రంగనాయకమ్మ గారికి తప్ప అనుకుంటాను. చిన్నపిల్లలకి పెద్దగా తెలీదు కదా! ఆహారంలో తేడాలు. చలం గారు అలవాటు చేసుకున్నారు.

ఇది జరిగాక, దీక్షితులుగారు “ఇలా కాదు నువ్వు సూర్య నమస్కారాలు చెయ్యి. అవి చేస్తే, తలనొప్పులు తగ్గుతాయి''అన్నారు. సరే!అది కూడా చూద్దాం.అనుకోని, చిన్న పిల్ల సౌరిస్ తో కలసి, తెల్లవారుజామున మూడు గంటలకు లేచి, బాన లో నిలవ ఉంచిన చన్నీళ్ళతో స్నానం చేసి, సూర్య నమస్కారాలు చేశారు. అప్పటికి కూడా ఆయన తలనొప్పి తగ్గలేదు.

ఆయన గుంటూరులో పనిచేస్తుండగా, ఒకయోగి వచ్చాడు. ఆయనకు “లోనా వాలా”లో ఆశ్రమం వున్నది. ఆయన “యోగాభ్యాసం చేస్తే, తలనొప్పి తగ్గిపోతుంది. యోగాభ్యాసాలు చేసేటప్పుడు పలచని పెసరపప్పూ,

మజ్జిగా అన్నం తప్ప ఏమీ తినకూడదు. ఆడవాళ్ళ గురించి అస్సలు ఆలోచించకూడదు.” అన్నారు. ఆయన చెప్పిననియమాలన్నీ పాటించీ, యోగాభ్యాసాలు అన్నీ చేశారు. అయితే, తలనొప్పి తగ్గటం సంగతి అలా వుంచి, బక్క చిక్కి సగం అయిపోయారు. అంతే కాకుండా, ఆయనకు ఎంత అసౌకర్యంగా అనిపించిందంటే, పది మంది వున్న చోటుకి వెళ్లలేకపోయారు. వెళ్తే, ఏదో దుమ్ము మీదన పడుతున్నటువంటి భావన వచ్చేది. ఇక దాంతో యోగ సాధన మానేశారు. తరువాత, తిరువన్నామలై వెళ్ళేవరకూ ఏవో చిన్నచిన్న యోగాసాధనాలు మాత్రమే చేసేవారు.

గుంటూరులో ఉన్నపుడే మరో విషయం ఏం జరిగిందంటే..చలం గారు ఎప్పుడూ పది మంది నడిచే దారిలో వెళ్ళరు కదా! అక్కడ స్కూలులో వుండగా ఒకసారి గవర్నరు గారు ఇనస్పెక్షన్ కి వచ్చారు. అందరూ కూడా మంచి డ్రెస్సులు వేసుకున్నారు. గవర్నర్ అంటే, బ్రిటీష్ వాళ్ళే కదా! చలంగారు మాత్రం ఆడవాళ్ళు వేసుకునే జంపర్ లాంటిది ఏదో వేసుకున్నారు. వాళ్ళందరికీ సహజంగానే కోపం వచ్చింది. “గవర్నర్ గారు వచ్చినపుడు ఇలాంటి పనులు చేస్తావా?”అని నర్సారావు పేట ట్రాన్స్ ఫర్ చేశారు.

ఆ నర్సారావుపేటలో మళ్ళీ కష్టాలు మొదలు. ఇల్లు వెతుక్కోవడం లాంటివి. భార్యా, పిల్లలూ బెజవాడలో వున్నారు. ఆ సమయంలో భార్య రంగనాయకమ్మ గారు పూనుకొని మద్రాస్ వెళ్లారు. ఎందుకంటే ఈ ట్రాన్స్ ఫర్లు అవీ అక్కడ నుండే జరగాలి. అక్కడకు వెళ్లి దానికి సంబంధించిన డిపార్ట్ మెంట్ వాళ్ళతో మాట్లాడి, “మా ఆయన అలాంటి వాడు కాదని ఒప్పించి, కొన్ని షరతులకు ఒప్పుకొని, సంతకం పెట్టి, మళ్ళీ బెజవాడకు ట్రాన్స్ ఫర్ చేయించుకున్నారు. చలంగారి తరపున ఆమె ఒప్పుకున్న షరతులు ఏమిటంటే...సూట్లు వేసుకోవాలి. ఎక్కువగా నవ్వకూడదు. చక చకా నడవకుండా, అరవై ఏళ్ళకి వాళ్లకి మల్లే నడవాలి. కింద టీచర్లనీ, జవాన్లనీ అవసరమై నపుడు తిడుతూ వుండాలి. ఆయన జీవితంలో ఏం జరుగుతుందో, ఆ బాధలన్నీ మాతో చెప్పుకుంటూ వుండాలి – ఇలాంటివి అన్నీ ఒప్పుకున్నాక బెజవాడ ట్రాన్స్ ఫర్ చేయించారు.

ఆ సందర్భంలో ”ఈయన మీద ఈర్ష్య.అందుకని పైకి ఏవేవో రాస్తుంటారు. ఈయన సంగతి వాళ్లకి తెలుసా?నాకు తెలుసా?”అని ఆమె అనేవారట. నిజానికి ఆమె, ఆయన తిరుగుళ్ళ గురించి ఎలా వున్నాగానీ, ఇలాంటి అవసరాలు వస్తే, భర్తకు సహకరించడానికి ముందుండేవారు.భార్య రంగనాయకమ్మ గారి గురించిన ప్రస్తావన వచ్చింది కాబట్టీ, ఒక విషయం చెప్పుకోవాలి.

చలంగారి జీవితంలో అత్యంత ప్రముఖమైన పాత్ర వహించినటువంటి వ్యక్తి అయినప్పటికీ..విపరీతంగా కష్టాలకూ, దుఃఖాలకూ, లోనయినటువంటి వ్యక్తి. జీవితాంతం బాధలు బాటల్లోనే పయనించిన వ్యక్తి. ఏదో వివాహం అయిన 3,4, ఏళ్ళు మినహాయించి, కాకినాడలో రత్నమ్మ పరిచయం అయిన దగ్గర నుంచి, దాదాపు చివరి వరకూ ఆమె మరణించేవరకు కూడా బాధల్లోనే వుండిపోయారు. మరి చలం గారు కొన్నికొన్ని

కోణాల్లో అర్థం కారు. అందుకే అంటుంటారు. "చలం గారిని అర్థం చేసుకోవడం చాలా కష్టం" అని. "సమాజంలోని దుఃఖ పడే స్త్రీల కన్నీళ్లను తుడవడమే నా లక్ష్యం."అని చెప్పుకున్న చలం గారు, ఇంట్లో తన భార్య నిరంతరం కార్చే కన్నీరుని గమనించకపోవడం, గమనించినా పట్టించుకోక పోవడం, ఇది చలం గారి వైవిధ్య కోణాల్లో ఒకటి అనుకోవచ్చు. అయితే జీవితమంతా కూడా నిలబెట్టుకున్నటువంటి, నిఖార్సయిన, నిజాయితీకి ఉదాహరణ ఏమిటంటే...ఇవన్నీ కూడా "తను చేశానని, భార్యని బాధ పెట్టాననీ, తన వల్ల జీవితాంతం బాధ పడే వ్యక్తి తన భార్యేనని" చలం గారు ఒప్పుకుంటూ, తన జీవిత కథలో రాసుకోవడం. అది కూడా చలంగారి ఒక కోణానికి ఉదాహరణ అని చెప్పుకోవాలి. ఆయన ఏం చెప్పారంటే, "నా జీవిత పద్ధతి వల్లా, తిరుగుబాటు వల్లా, జీవితం అంతా నష్టపడ్డది "టి"[ "టి" అంటే భార్య]నేను బ్రహ్మ సమాజంలో చేరినపుడు తన బంధువుల్నీ, స్నేహితుల్నీ,తన పెద్ద ఆస్తినీ వదలుకొని నన్ను నమ్మి నాతోనడచింది. అంతలోనే నేను రత్నమ్మ ప్రేమ వ్యవహారంలో చిక్కుకునే టప్పటికి, తను దిక్కులేక అణిగి పోయింది. నేను నైతికంగా సంఘంమీద తిరగబడి, ఈశ్వరుడ్ని కూడా నిరాకరించి, ఎడారి దారిన పడేటప్పటికి, ఆమె ఇంక గతిలేక, నాకు ఎదురు తిరిగింది. నాతో తప్ప, నా మిత్రులందరితోటీ విరోధి. నానుంచి కూడా దూరమయ్యింది. అట్లా ఒంటరిగా నిలుచుని ధర్మ యుద్ధం సాగించింది. అయితే, అప్పటికి కూడా, నన్ను విడిచిపోకుండా, నాతో ఉండిపోవడం వలన, ఆమె ఎవరి సానుభూతి పొందలేకపోయింది." ఎక్కడికి వెళ్ళినా గానీ, "అదిగో ఫలానా వాడి భార్యవా నువ్వు?" అని చలం గారి మీద వున్న ద్వేషాన్ని, రంగనాయకమ్మ గారి మీద చూపించేవాళ్ళు. ఇంకా చలం గారు ఏమంటారంటే...

"నా మల్లే ఏకాకిగా నిలబడడం. ఆమె స్వభావం లో లేదు. ఆమె ఆచరణలకు గౌరవించి నేను వదిలేశాను. ఇల్లంతా నీదే"అని చెప్పేశాను. అందుకని, చలంగారు ఏం చేసినా, రంగనాయకమ్మ గారు ఏమీ అనే వారు కాదట. రంగనాయకమ్మగారు ఏం చేసినా చలంగారు ఏం అనేవారు కాదట. "అందుకనే ఇంటి నిండా దేవతలూ, పూజలూ, ముసలమ్మలూ, బ్రాహ్మణులూ, యదేచ్ఛగా విహరించేవారు." అని చెప్పారు చలంగారు. ఇవేమీ కూడా ఆయన కార్యకలపాలకీ, రచనలు రాయడానికీ, ఆయన కోసం వచ్చే స్నేహితులకు గానీ , స్నేహితురాళ్ళకు గానీ అడ్డం వచ్చేవి కావు.

అయితే, భార్య రంగనాయకమ్మ గారు, చలం గారు తన త్రోవలో తను ఉండడంతో ఆమె పబ్లిక్ సర్వీస్ లోకి వెళ్లారు. ఆ పబ్లిక్ సర్వీస్ లోకి వెళ్ళినపుడు...ఆమెలోని వివేకాన్నీ, తెలివినీ భరించలేని, నవనాగరికపు సుందరీ మణులు, చలం చేసిన పాపాలకీ, చలం చేసిన పనులకీ చలం దొరకడు కాబట్టి, ఆమెను నిలదియ్యడం ప్రారంభించారు. ఆమె బాగా చదువుకున్నారు. అన్నీ తెలిసిన మనిషే. ఇన్ని తెలిసినా గానీ, ఆమెకు నిరంతరం, జీవితాంతం వేదనే మిగిలింది. కేవలం వేదన మిగలడమే కాదు. తనని తానూ మరచిపోయి, మతి భ్రమించిన పరిస్థితులకూ లోనయ్యారు. దాన్ని గురించి కూడా చలం గారు యెంత నిజాయితీగా చెప్పారంటే..." రంగనాయకమ్మ గారిని క్రుంగ దీసింది ఆమె

పిల్లలు. వాళ్లకు బుద్ధి తెలిసినప్పటినుండి వాళ్ళు నా వైపు. నామీద ప్రేమ. నా మాట వింటారు. వాళ్ళ పెంపకం విషయంలో ఆమెకూ, నాకూ పెద్ద తగాదాలు పడ్డాయి."[ఈ వివరాలన్నీ తరవాత వస్తాయి]

తనకీ, రంగనాయకమ్మగారికీ ఉన్న వైరుధ్యం గురించి చలంగారు చెప్పిన కొన్ని విశేషాలు..."పిల్లలు ఏమైనా అల్లరి చేస్తే, ఏమీ కొట్టకూడదు. ఏం చేసినా వదిలెయ్యాలి"అనేవారు. రంగనాయకమ్మ గారు ఎప్పుడైనా అల్లరి చేస్తే, ఒక చిన్న దెబ్బ వేసినా గానీ, ఈయన దగ్గరుండి తీసుకెళ్ళి, రెండు చేతులూ పట్టుకొని, "ఇప్పుడు కొట్టండి అమ్మని"అనేవారట. ఆ విషయం ఆయనే రాసుకున్నారు.

పిల్లల దుస్తుల విషయంలో గానీ, వేష భాషల విషయంలో గానీ చలం గారు చెప్పినట్టే జరిగేది. ఆమె పాపం తల్లి. తల్లికి పిల్లల్ని అలా చూసుకోవాలి. ఇలా చూసుకోవాలి అని వుంటుంది కదా! ఏదో జడ వెయ్యాలనీ. పువ్వులు పెట్టాలనీ, చక్కని దుస్తులు వెయ్యాలనీ, లంగా, జాకెట్టూ వెయ్యాలనీ ఇలా ఏవేవో కోరికలు ఉండేవి. కానీ, చలం గారు చొక్కా లాగూవేసేవారు. క్రాపు చేయించేవారు. అసలు వాళ్ళు ఏ జాతి వాళ్ళో, ఏ కులం వాళ్ళో, అసలు వాళ్ళు భారతీయులు అవునో కాదో కూడా తెలియకుండా అలాంటి వేష బాషలు చేసేవారు. పిల్లలు తెల్లగా అందంగా వుండేవారు. చూసిన వాళ్లకు వాళ్ళు యురోపియన్లో, తెలుగు వాళ్ళో, ఒకవేళ తెలుగు వాళ్ళయితే ఏకులం వాళ్ళో తెలిసేది కాదు.

ఇంటికి ఎవరైనా వస్తే, "వాళ్ళు మన కులం గురించి అడిగితే, మీరు ఇష్టం వచ్చినట్టు తిట్టండి."అని చెప్పేవారట. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నకొద్దీ, ఇలాంటివన్నీ రంగనాయకమ్మ గారిని విపరీతంగా బాధ పెట్టడం ప్రారంభించాయి. ఆమె పిల్లల్ని "వీళ్ళు నా పిల్లలు" అని చెప్పుకోవడానికి కూడా భయపడేది. ఎందుకంటే, వాళ్ళు ఎవరి దగ్గర ఏం మాట్లడేస్తారోనని. ఇవన్నీ కూడా చలం గారు సమీక్షిస్తూ చెప్పారు." రవి కోసం ఆరు సంవత్సరాలు నా జీవితాన్ని అర్పించానో, అలాగే, పిల్లల కోసం రంగనాయకమ్మ గారిని బలిచ్చాను" అని ఆయనే ఒప్పుకున్నారు.

పిల్లలు పెద్దవాళ్ళు అయ్యాక తండ్రి గురించి చెప్పి, తనవైపు తిప్పుకోవాలని చూసారు రంగనాయకమ్మ గారు. కానీ, సహజంగానే స్వేచ్ఛను ఇచ్చేవారిని ఎక్కువగా ప్రేమిస్తారు కాబట్టీ, పిల్లలందరూ తండ్రి వైపే నిలబడి పోయారు. రంగనాయకమ్మ వేదనలూ, బాధలూ ఆమెను జీవితాంతమూ వెంటాడుతూనే వున్నాయి. మరి చలం గారు, ఆడవాళ్ళ కష్టాలు తీరుస్తాను. కన్నీళ్లు తుడుస్తాను. అంటారు కదా! మరి భార్య గురించి ఎందుకు ఇలా చేశారు. అనేది మొత్తం చలం గారి యొక్క మొత్తం జీవితాన్నీ, రంగనాయకమ్మ గారి మొత్తం జీవితాన్నీ చదివి అర్థం చేసుకోవాల్సిన విషయం. ఈ సమాచారాన్నిఇక్కడ ఆపి, తరవాత కథలోకి వద్దాం.

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 మార్చి 12 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు